# ఐటీలో మనమే మేటి

## ఐటీ కారిడార్‌లో అభివృద్ధే నమూనా

- శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లో గెలుపుపై బీఆర్‌ఎస్ ధీమా
- గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రభుత్వ పనితీరుపై ఓటర్లు సంతృప్తి



సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అభివృద్ధిలో ఐటీ కారిడార్ అత్యంత కీలకమైంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఐటీ కారిడార్‌లోని ప్రాంతాల పరిస్థితి ఏమవుతుందోనన్న ఆందోళన ఉండేది. అలాంటిది రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వచ్చిన ప్రభుత్వం ఐటీ రంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దాని ఫలితంగానే దేశ సిలికాన్ వ్యాలీగా ఉన్న బెంగళూరును మించిపోయేలా ఇక్కడ ఐటీ రంగం దినదినాభివృద్ధి చెందుతున్నది. ఐటీ కారిడార్ అంటే కేవలం ఐటీ కంపెనీల కార్యాలయాలే కాదు. పక్క పక్కనే నివాస భవనాలు, ఐటీ కంపెనీల కార్యాలయాలు. వాక్ టు వర్క్స్ అనే భావనతో రూపుదిద్దుకున్న ఐటీ సెజ్‌లు హైదరాబాద్ అభివృద్ధికి నమూనాలుగా మారాయి. ఐటీ కారిడార్‌లో నివాసం ఉంటున్న ప్రజలు ఊహించిన రీతిలో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం తీసుకున్న ప్రణాళికలే ప్రధాన కారణం. ఇవే ఇప్పుడు ఐటీ కారిడార్‌లోని శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపునకు దోహదం చేసేలా ఉంటున్నాయి. ఇంటింటి ప్రచారం చేస్తున్న పార్టీ అభ్యర్థులకు స్థానికుల నుంచి వస్తున్న సానుకూల స్పందనే ఇందుకు నిదర్శనంగా పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లోని కంపెనీల్లో పని చేస్తున్న ఐటీ ఉద్యోగుల నివాసాలు ఇదే ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ పనితీరు పట్ల ఐటీ ఉద్యోగులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

### గేటెడ్ కమ్యూనిటీల్లో అభివృద్ధిపైనే ప్రధానంగా చర్చ

ప్రస్తుతం నగరంలోనే కాకుండా రాష్ట్రమంతా ఎన్నికల వాతావరణమే ఉండటంతో ప్రజలు గెలుపు ఓటములపైనే ప్రధానంగా చర్చించుకుంటున్నారు. ఏ పార్టీ ఏం చేసింది? ఏ అభ్యర్థి ఎలాంటి వారు? సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న అభ్యర్థి ఎలాంటి అభివృద్ధి చేశాడనే అంశాలను బస్తీలు, కాలనీల్లోనే కాకుండా ఐటీ కారిడార్‌లో అత్యధికంగా ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లోనూ వీటిపైనే చర్చించుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా కేవలం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9వేల కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి అరికెపూడి గాంధీ పేర్కొంటున్నారు. అదే విధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రాంతాలైన నార్సింగి, మణికొండ, కోకాపేట, గండిపేట ప్రాంతాల్లో ఐటీ కంపెనీలతో పాటు నివాస ప్రాంతాలు భారీ సంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో గత తొమ్మిదిన్నరేండ్లలో గణనీయమైన అభివృద్ధి జరగడం, ఈ ప్రాంత రూపురేఖలు ఒక్కసారిగా మారిపోవడంతో స్థానిక ప్రజలు ప్రభుత్వ పనితీరు వల్లే ఇదంతా సాధ్యమైందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజలు అడగకపోయినా ఐటీ కారిడార్‌లో పదుల సంఖ్యలో లింకు రోడ్ల అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఐటీ కారిడార్‌లోని నివాస ప్రాంతాల్లోనూ మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు వాటిని సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చిన విషయాన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో నివాసం ఉంటున్న వారు చర్చించుకుంటున్నారు. ఇలా రెండు నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి ఊహించని రీతిలో జరగడంతో ప్రభుత్వం పట్ల అత్యంత సానుకూలతను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తేనే మరింతగా అభివృద్ధి జరుగుతుందనే అంశంపైనే కాలనీ సంక్షేమ సంఘాలు తమ అంతర్గత సమావేశాల్లోనూ చర్చించుకుంటూ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తున్నారు.

## కిమ్స్ ఆధ్వర్యంలో లిటిల్ వన్స్




కిమ్స్ కడల్స్ దవాఖాన చైర్మన్ బొల్లినేని భాస్కరరావుతో కలిసి లిటిల్ వన్స్ క్యూర్ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ దర్శకుడు రాజమౌళి

మాదాపూర్, నవంబర్ 18 : సాధారణంగా వైద్యులకు వారం లేదా నెలలో ఒక చాలెంజ్ కేసులు వంటివి వస్తుంటాయని, ఎన్‌ఐసీయూలో వైద్యులకు రోజుకు ఒక చాలెంజ్ ఉంటుందని బాహుబలి ఫేం దర్శకుడు, ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం ఏర్పాటు చేసిన ఎన్‌ఐసీయూ గ్రాడ్యుయేట్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎస్ రాజమౌళి విచ్చేసి కిమ్స్ కడల్స్ దవాఖాన చైర్మన్, డాక్టర్ బొల్లినేని భాస్కరరావుతోపాటు కిమ్స్ కడల్స్ వైద్య సిబ్బందితో కలిసి లిటిల్ వన్స్ క్యూర్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాంప్ వాక్ చేస్తూ చిన్నారులు అలరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఐసీయూలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన చిన్నారులు వేదికపై ర్యాంప్ వాక్ చేయడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి చిన్నారుల్లో ఉత్సాహాన్ని పెంచిన కిమ్స్ వైద్య బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. కిమ్స్ కడల్స్ దవాఖాన చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ.. పేద తల్లిదండ్రులకు నెలలు నిండకముందే పుట్టిన చిన్నారులు వారికి ఏవైనా సమస్యలు వస్తే లిటిల్ వన్స్ క్యూర్ ఫౌండేషన్ ద్వారా వారికి ఆర్థిక సాయం చేసి పూర్తిస్థాయి చికిత్సలు అందిస్తామని తెలిపారు. నియోనాటాలజీ క్లినికల్ డైరెక్టర్, కిమ్స్ కడల్స్ ఎన్‌ఐసీయూ విభాగాధిపతి, డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. ఎన్‌ఐసీయూలో చికిత్స పొంది సమస్యలను అధిగమించి వచ్చిన చిన్నారులు కార్యక్రమంలో ఉత్సాహంగా అలరించడం సంతోషంగా ఉందన్నారు. నెలలు నిండక ముందే పుట్టిన శిశువులకు ఇవ్వాల్సిన పోషకాహారం, వారి ఎదుగుదల, అభివృద్ధి, వారిలో ఉండే సాధారణ సమస్యల గురించి అవగాహన కల్పించారు. నెలలు నిండక ముందే జన్మిస్తున్న చిన్నారుల జననాలను తగ్గించడం, అలా పుట్టిన చిన్నారులకు సంరక్షణను మరింతగా పెంచడం అనే లక్ష్యాలకు అనుగుణంగా కిమ్స్ కడల్స్ నిబద్ధతతో ఉందన్నారు. కిమ్స్‌లో అన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన వైద్యులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ కడల్స్, డాక్టర్ శిల్పిరెడ్డితో పాటు చిన్నారులు, తల్లిదండ్రులు ఉన్నారు.

## ప్రణీత్ గ్రూప్ వెంచర్ బ్రోచర్ ఆవిష్కరణ



హైటెక్స్‌లో ప్రణీత్ గ్రూప్ వెంచర్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన సంస్థ డైరెక్టర్లు

మాదాపూర్, నవంబర్ 18 : మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం ప్రణీత్ గ్రూప్ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు నరేంద్రకుమార్ కామరాజు, ఆదిత్యా కామరాజు, నర్సిరెడ్డి సిప్పిడి, సందీప్‌రావు, మాధవరామ్, కేవీ ఎస్ నర్సింగ్‌రావు హాజరై ప్రణీత్ గ్రూప్ వెంచర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ, హైదర్‌నగర్‌లో ఇక్సోరాలో విలాసవంతమైన లగ్జరీ ఫ్లాట్స్‌ను ప్రణీత్ గ్రూప్ 8.31 ఎకరాల విస్తీర్ణంలో అందంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 1305 నుంచి 3130 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు టవర్స్‌లో 1504 ఆధునిక నివాసాలను కలిగి అద్భుతంగా రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందులో 2, 2.5, 3, 3.5 బీహెచ్‌కేల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో కార్ పార్కింగ్, పిల్లల ఆట స్థలం, వాకింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్, మల్టీ పర్పస్ గేమ్స్, యంఫీ థియేటర్, పెట్ పార్క్, ఇండోర్, అవుట్ డోర్ వసతులను సైతం అందిస్తున్నట్లు తెలిపారు.

## సహారాకు ఘన నివాళి



జూబ్లీహిల్స్, నవంబర్ 18 : సహారా అధినేత శ్రీసుబ్రతారాయ్ సహారా అంతిమ యాత్రలో పలువురు పాల్గొని నివాళులర్పించారు. సహారాకు ఆయన సతీమణి స్వప్నారాయ్, కోడలు రిచారాయ్, చాందినీ రాయ్, సహోదరుడు జొయెబ్రొతోరాయ్, సతీమణి మౌషుమీ రాయ్, త్రిష నియోగి, పుఖ్‌రాజ్ నియోగి నివాళులర్పించారు. ఈ అంతిమ యాత్రలో జగ్రాతో రాయ్, రజత్ ప్రకాశ్, ఓపి శ్రీవాత్సవ్, రాజేంద్ర చౌదరి, ప్రమోద్ తివారి, అఖిలేష్ యాదవ్, రాజ్ బబ్బర్‌తోపాటు బంధువులు, ఆత్మీయులు, సుమారు 5 వేలమంది అభిమానులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో వచ్చే ఏడాదిలో మెగా జాబ్ మేళా నిర్వహించాలన్న ఆలోచనతో ఆ యూనివర్సిటీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతను దృష్టిలో పెట్టుకుని దాదాపు 200 పైగా కంపెనీలతో ఒప్పందం చేసుకుంటున్నారు. అందుకు సంబంధించి ప్రయత్నాలు చేస్తున్నారు. ఐటీ, మార్కెటింగ్, బీమా, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, ఇ-కామర్స్ వంటి అన్ని రంగాలకు చెందిన కంపెనీలను ఈ మెగా జాబ్‌మేళాకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

## కొత్త కాలనీలు మార్గాల్లో సిటీ బస్సు సర్వీసులు

- అన్ని మార్గాల నుంచి ఐటీ కారిడార్, సికింద్రాబాద్‌కు బస్సులు
- ఆర్టీసీ అందిస్తున్న సర్వీసులతో ఫిదా అవుతున్న నగర ప్రయాణికులు
- విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులకు అనుకూలంగా మారిన సిటీ బస్సు సర్వీసులు



సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : నగరంలో కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీ వాసులకు అనుకూలంగా త్వరలో ఆర్టీసీ సిటీ బస్సులు నడుపనున్నది. ముఖ్యంగా అవుటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా కొత్తగా వందల కొద్దీ కాలనీలు ఏర్పాటయ్యాయి. దీంతో ఆ కాలనీలకు బస్సుల కనెక్టివిటీని పెంచాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని మేజర్ కాలనీల్లో సిటీ బస్సుల అనుసంధానం పెరిగింది. త్వరలోనే మిగిలిన కాలనీల వారికి కూడా అందుబాటులోకి సిటీ సర్వీసులను తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఆర్టీసీ అధికారులు రూట్ సర్వే కూడా చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా కాలనీలకు రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. ఉదాహరణకు ఉప్పల్ నుంచి మెహిదీపట్నం వరకు మాత్రమే నడుస్తున్న సిటీ బస్సు సర్వీసులను మెహిదీపట్నం నుంచి చెంగిచర్ల వరకు పొడిగించారు. ర్యాక్‌వేవ్ నుంచి కూకట్‌పల్లి వరకు నడుస్తున్న సర్వీసును బాచుపల్లి వరకు పొడిగించారు. ఇప్పటికే నగరంలోని అనేక కాలనీల నుంచి మెట్రో స్టేషన్లకు సిటీ బస్సులను అనుసంధానించడం వల్ల నగర ప్రయాణికులకు ప్రయాణం సులువైంది. పైగా తక్కువ ఖర్చులోనే ఎక్కువ దూరం ప్రయాణించేలా ప్రజా రవాణా మెరుగుపడింది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రయాణికులు ఫిదా అవుతున్నారు. ఆర్టీసీ సర్వీసులను అన్ని మార్గాలకు విస్తరించడం వల్ల ప్రైవేటు ట్రాన్స్‌పోర్టును వీడి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును అధిక సంఖ్యలో ప్రయాణికులు సద్వినియోగం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలోని అన్ని ప్రధాన రూట్లలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో ఫుల్‌గా నిండటమే అందుకు నిదర్శనం అని చెప్పవచ్చు. అయితే ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు అనుకూలంగా మారుతున్నాయని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తున్నది.